సద్గమయంలో

★

సతీశ్

(గత సంచిక తరువాయి)

ఆమె వెళ్ళిపోయిన తర్వాత ఆతనికి అనిపించింది. తను మొదటినుంచీ ఆమెతో గౌరవహీనంగానే వ్యవహరించాడు. సముదాచారం విస్మరించినట్లు మాట్లాడాడు. ఆమె వైపు మింగివేసేట్లు చూశాడు తనకి తెలియకుండానే. మనియార్డరు రసీదు ఇవ్వటానికి వచ్చినప్పుడు కటువుగా మాట్లాడాడు. ఆమె ప్రేమను గురించి, బాధ్యత గురించీ తర్క వితర్కాలతో వాటిని కాస్త చీల్చి, ఆమెని అవమానించి పంపాడు. వెళ్లేటప్పుడు తల ఎత్తి తనవైపు, ఇదివరకు చూసేటంత లాలనగా చూసి వెళ్ళటానికి గూడా అవకాశం లేనంత కటువుగా ప్రవర్తించాడు.

ఆమె గూడా తనతో పరిచయం కల్పించుకోవటం, తన కోసం రావటం తనతో చనువుగా ఉండి మనస్సువిప్పి మాట్లాడటం, ఇవన్నీ తనలాగే వ్యధితమై, క్షుభితమై ఉన్న మనస్సుని తేలిక పరుచుకోవటానికేమో. అట్లా అయితే తన కేదో ఆమె మీద అధికారం ఉన్నట్లు, అధికారం కోరుతున్నట్లు లాయరు ప్రశ్నలన్నీ వేశాడు. తనలాగా బాధ్యతకోసం బ్రతుకుతున్నవ్యక్తి గనుక, తనతో సమానంగాఉన్న ఏకీభావాన్ని పురస్కరించుకొని తాదాత్మ్యత కోరుతూ ఆమెని వ్యథ పెట్టాడు.

ఆమెతో పరిచయం, మిత్రత్వం, సాన్నిహిత్యం తనలో వించి, తనకి తెలియకుండానే బైటికి పోతున్న మానవత్వాన్ని కట్టుగట్టి, దానిస్థానే ఆక్రమించిన అమానుషపు స్థాయికి రానివ్వకుండా చేసింది. ఆ విషయం తనకు రూఢిగా తెలుసు. లేకపోతే తను ఏం చేసేవాడో, ఏం అత్యాచారంచేసి, తన కుటుంబానికి అప్రతిష్ట తెచ్చేవాడో గూడా తెలియదు. తనకు అంత సహాయం చేసిన, హృదయ వేదనని గుప్త పరుచుకోలేని అబలని, తనమీద విశ్వాసంతోఉండే ఆమె హృదయం తరిచి, మథించటానికి ప్రయత్నం చేశాడు. తనూ గోపాలరావులు చేసే పనే చేశాడు. తన బాధ్యతని ప్రేమించే నిర్మలను, బాధ్యతాజ్ఞానం గల తనను ప్రేమిస్తున్నదేమోనని అనుకొని, ఆ ప్రేమ నిర్ధారణ చేసుకోవటానికి ఏమో గూడా తెలియకుండా ఆమె హృదయం మథించి వ్యథితం చేశాడు.

తనలో ఈ మార్పు ఎందుకు వచ్చిందో తరచి చూసుకున్నాడు. శకుంతల, శకుంతల వంచన ఇప్పుడు స్మృతిపథంలో లేవు. నిర్మల స్వభావం కలిగి, అందం, ఆకర్షణలతో ప్రలోభపెడుతూ, మనస్సులో చోటు చేసుకున్న నిర్మలకు వెనకగా మరేదో అడుగున ఉన్నట్లు తెలిసింది. అది తండ్రి వ్రాసిన ఉత్తరం. హోటలు మెతుకులు తిన్నవాడివికావు. తినలేవు అని మొదలుపెట్టి, చివరకు తేల్చాడు, బాధ్యతాయుతమైన ఈ జీవితంలో అన్ని బాధ్యతలూ అవసరమైనవే అని. అందులో కొన్ని మనస్సుకిమాత్రం అంకితం అయిఉండేవి. మరికొన్ని శరీరంమీద మనకు ఉండేవని. అందుచేత బాధ్యతల న్నిటికీ తగినంత విలువ ఇస్తూ ఉండాలి. కాని, ఏ ఒక్కటి త్రోసిరాజని రెండవదానిమీద కేంద్రీకృతం చెయ్యకూడదు. ఇంకో విషయం గూడా వ్రాశాడు. జీవితావసరాలలో, విధి ఆపాదితమై ఏదో ఒకటి అక్కరకురాక వ్యర్థమైపోతే, దానిని గురించిన వ్యథా, బాధలతో జీవితాంతం గడిపేకంటే, సమాన ప్రతిపత్తిగల వేరొక వస్తువుతో ముందుది వ్యర్థమై పోవటానికిగల అవకాశాలను రానివ్వకుండా చూసుకుంటూ, అవసరాన్ని గడుపుకుంటూ ఉంటే బాధ్యతలు నిర్వర్తించటంలో కలిగిన అలసట, నిర్వేదం కనబడవుట. తన అభిప్రాయం తెలియజేస్తే, తను ప్రయత్నం చేస్తాడట. లేక అట్లా సారూప్యమైన, సమాన ప్రతిపత్తిగల వస్తువు తనకు లభ్యమై స్వీకరిస్తే తను చాలా ఆనందిస్తాడట. ఇట్లా అంతమైన ఉత్తరంలోని భావాలు, మనసులో ముద్రితమైన నిర్మల శరీర సౌష్టవపు, హృదయ నైర్మల్యపు ఛాయల ప్రక్కనించి మెదులుతూ ఉన్నాయ్.

తండ్రి వ్రాసిన ఉత్తరం, అందులో పొందుపరచిన పరమసత్యాలూ, అసమర్థుడూ, వ్యర్థుడూ, అప్రయోజకుడూ అనుకున్న తన జీవితంలో తనూ గర్వించటానికి ఒక అంశం ఉన్నదని నిర్మల చూపెట్టటం, వీటివల్ల కొంత ఉద్వేగంపొంది కాస్త ముందుకు దూకాడు. శకుంతల, తన దగ్గర లేనివి, తనకు విశ్వాసంలేనివీ అయినవన్నీ అవసరమైనవనీ, అవిలేకపోతే జీవితం వ్యర్థమైనదనీ చూపెట్టింది. నిర్మల తన దగ్గర ఉన్నది ఒకటి, తన దగ్గర ఉన్నదనీ, అది ఒక్కటే ఉండటం తనకు నిజంగా గర్వకారణం అన్నట్లు మాట్లాడింది. బాధ్యత ఒక ఆడదానికే గర్వకారణం అయినపుడు మగవాడికి ఇంకెంత గర్వకారణం కావాలి.

క్రొత్తగా తెలిసివచ్చిన ఈ గర్వంతోటే, తండ్రి వ్రాసిన ఉత్తరంతోటే తనను బాధ్యతాయుతమైన వాడుగా గుర్తించి నిర్మల ప్రేమించింది, అనే అపోహతోటే కొంత కలవరపడి చాలా దూరం వెళ్ళాడు. కాని, వెంటనే తెలిసి వచ్చింది ఇక తన బ్రతుకు తాను ఒంటరిగా, బాధ్యతకోసం, క్షోభపెట్టే శకుంతల అవసరం లేకుండా సారూప్యమైన బాధలతోఉన్న నిర్మలను ప్రేమిస్తున్నాననిగాని, ఆమె ప్రేమిస్తున్నది అనిగాని అపోహ పడకుండా తన ప్రవర్తనలో సభ్య సమాజపు మర్యాదల నతిక్రమించకుండా గడుపుతాడు. ఆ మర్యాద అతిక్రమించినందుకు మర్నాడువెళ్ళి నిర్మలను క్షమాపణ అడుగుదామని నిర్ణయం చేసుకొని, నిరాశ గూడా అణిగిపోయి, దైన్యంతో వచ్చిన శాంతితో హాయిగానే నిద్రపోయాడు.

మర్నాడు అన్నీ మామూలుగానే జరిగినయ్. మామూలుగా జరగనిదల్లా నిర్మల ఆఫీసుకు రాకపోవటం, పదిహేను రోజుల సెలవుకి ఆమె పంపిన దరఖాస్తు ఆఫీసరు టేబులుమీద కనిపించడం. ఆమె ఇంటికి వెళ్ళిందన్నమాట. తను ఆమె ఇంటికి ఉదయమే వెళ్ళిఉండవలసింది. కాని వెళ్ళలేదు. వెళ్ళకపోవటానికి కారణంలేదు.

ఆమెమీద ఏ అధికారంలేని తను, ఆమెకు ఏమీకాని తను, ఆమెకు ఏవిధంగా సాయపడలేని తను, ఆమె హృదయాన్ని తరచటానికి, ముక్కలుగాకోసి అడుగున ఏమున్నదో చూడటానికి ప్రయత్నించాడు. అది సహించలేక, సహించలేక చేసేదిలేక, తననించి, తనలోఉన్న కీచకుడికి దూరంగా వెళ్ళిపోయింది. ఆ విషయం స్పష్టమైంది.

ఆరోజు ఆఫీసరు చాలా పెందరాళే ఇంటికి వెళ్ళాడు. ప్రసాదరావు తిన్నగా నిర్మల ఇంటికే వెళ్ళాడు. ఆమె ఊరికి వెళ్ళి ఉంటుంది అనుకున్న తర్వాత గూడా ఎందుకు వెళ్దామనుకున్నాడో, ఎందుకు వెళ్ళాడో గూడా తెలియకుండా వెళ్ళాడు. కాని వెళ్ళాడు. ఇంకా ఊళ్ళోనే ఉండవచ్చు అనే అనుమానంతో, ఉంటే క్షమాపణ చెప్పవద్దాము, చెబితే తన హృదయం తేలిక పడుతుంది అనే ఉద్దేశ్యంతో వెళ్ళాడు.

ఆమె ఉన్నది. అతను వచ్చినందుకు సంతోషించాడు' ఆమె ఏమనుకున్నదో అతనికి తెలుసుకోవాలన్న ఉత్సాహంలేదు. మామూలుగానే ఏమీ జరగనట్లే ఆహ్వానించింది. ఏదో సర్దుకునే తొందరలో ఉన్నట్లు కనిపించింది. అతను అడిగాడు "ఏం తొందరలో ఉన్నారా" అని.

"ఏడు గంటల బండిలో ఇంటికి వెళ్తున్నాను."

ఇంతకుముందుఅన్నా మళ్ళీ ఒకసారి అన్నాడు "ఉదయమే వెళ్ళి ఉంటారనుకున్నాను"

"లేదు. ఉదయం ఆఫీసరుగారిఇంటికి వెళ్ళివచ్చాను, సెలవు కోసం."

అతనికి అర్థమైంది. అంత సెలవు సామాన్యంగా దొరకదుకాని, ఆమెకు ఎట్లా దొరికిందో అనే విషయం.

ఆమె అటూ, ఇటూ తిరిగి సర్దుకుంటున్నది.

ఎందుకు సెలవు పెట్టిందో, ఎందుకు ఊరికి వెళ్తున్నదో అడుగుదామనుకున్నాడు. కాని, ఆమె విషయాల్లో స్వతంత్రత తీసుకోవద్దు అనే తన నిర్ణయం గుర్తుకు వచ్చింది.

కాని తను వచ్చిన పని చెప్పలేదు. పని పూర్తి చేసుకొని వెళ్ళలేదు. ఆమె ఏదో సర్దుతూఉంది. "మీకేమీ అభ్యంతరం లేకపోతే నేను సర్దుకుంటూ ఉంటాను, మాట్లాడండి."

ఆమెకి సరిగ్గా సర్దుకోవటానికి మాత్రమే టైము ఉన్నట్లు ఉంది. అతనులేచి వెళ్దామని అనుకుంటూనే, కూర్చుని ఉండే అన్నాడు, "నేను ఉంటే మీకు పని సాగదేమో, చికాకుగా ఉండి." అని వెళ్ళటానికి లేవలేదు. ఆ విషయం ఆమె గమనించింది. ఒకసారి అతనివేపు చూసి నవ్వింది. అన్నది, "మీరు అక్కడ కూర్చొనిఉంటే నేను హాయిగా పని చేసుకుంటాను, అని నా నోటంట విందామనా?"

"అబ్బే వెళ్తాను" అని లేవటానికి ప్రయత్నించాడు. ఆమె మామూలుగానే అన్నది.

"ఫరవాలేదు కూర్చోండి. మీకూ ఇప్పుడేమీ పని లేదుగా" ఆమె గదిలో మూలగా, ఒక పెట్టిముందు కూర్చొని సర్దుకుంటూ అన్నది. అతను వచ్చిన పని ముగించుకొని వెళ్దామనుకున్నాడు. ఇంకా ఆ పని ఆరంభించనేలేదు. పూర్తి ప్రయత్నంచేస్తూ, ఇందాకటినించి గడిపాడు. కాని ఏ ప్రయత్నం చేశావు అని ఎవరన్నా అడిగితేమాత్రం, అతని దగ్గర సమాధాన మేదీ లేదు.

ఆమె వైపు చూడకుండా అన్నాడు, "నిన్న మీ మనస్సుని చాలా కష్టపెట్టాను. క్షమించండి" వచ్చిన పని అయిపోయినట్లుగా కదిలాడు కుర్చీలోనించి.

"ఈ మాట చెప్పి వెళ్ళటానికే వచ్చారా?" అంది అతని వేపు చూస్తూ.

"మిమ్మల్ని ఎంత కష్టపెట్టానో ఈ ఉదయమే అర్థమైంది, మీ లీవు లెటరుచూసి. నిన్న ఏ ఉద్దేశ్యంతోనూ ఆ సంభాషణలోకి దిగలేదు" అన్నాడు తలవంచుకొని.

ఆమె ఈసారి బాగా నవ్వింది. హృదయం తేలిక పడ్డట్టు నవ్వింది. అన్నది, "ఇంకా ఏం అర్థమైంది? ఇంకా ఊరినించి వెళ్ళలేదని గూడా అర్థమైందా?"

అతను అడిగిన దానికి సమాధానం ఇవ్వటంకోసం అన్నట్లు చెప్పింది. "మీరేమి అన్నారని క్షమించటానికి. ఏం తప్పు చేశారని?"

ఇక్కడే ఇబ్బంది వస్తుంది. ఆ సందర్భంలో అతనికి వచ్చిన ఇబ్బందే ప్రతివారికీ వస్తుంది. కొన్ని మనం చాలా గొప్ప అపరాధాలు అనుకుంటాం. అనుకొని, దానికోసమై వ్యథ పడతాము. కాని, అవి ఎవరికి చేశామో వాళ్ళు గూడా ఆ అపరాధం తీసుకున్నారనే అనుకుంటాము. కాని నిజంగా అపరాధంగా తీస్కున్నారో, లేదో ముందుగా తెలియదు. తీరా తీసుకున్నారని దాన్ని సర్దుకోవటానికో, క్షమాపణ చెప్పటానికోవస్తే వాళ్ళ

ఆ అపరాధం అపరాధంగా తీసుకోకపోవటమో, తీసుకున్నా తీసుకున్నట్లు ఏమాత్రమూ కనబడక పోవటమో, లేకపోతే దాన్ని పూర్తిగా పట్టించుకోక పోవడమో చేసినట్లు తెలుస్తుంది. అప్పుడు వెళ్ళిన వాళ్ళ పని మరీ సంకటావస్థలో పడుతుంది. ఇప్పుడు అతని పని గూడా అంతే అయింది.

తను ఏం తప్పు చేశాడో, అతను విడమరిచి చెప్పలేదు. ఆమె అతనివైపు వీపుపెట్టి మూలగా ఉన్నపెట్టె ముందు కూర్చుని బట్టలు సర్దుకుంటున్నది. వెనక్కు తిరగకుండానే అన్నది. ఇందాకఉన్న తేలికయిన వాతావరణంలేదు ఆ మాటల్లో "మీ ప్రశ్న నాకు క్రొత్తకాదు. నా బాధ్యత అక్కర్లేకుండా, నేను మాత్రం కావాలనుకున్న ప్రతి ఒక్కరూ ఆ ప్రశ్నే వేశారు. మరొకర్ని ఎవర్నో ప్రేమించి ఉంటావన్న అసూయపడ్డ ప్రతి ఒకర్కరూ వేశారు."

ఈ మాటలు వింటూనే అతను ఉలిక్కి పడ్డాడు. ఉలిక్కిపడి ఒకసారి ఆమెవైపు చూశాడు, కుర్చీలో వెనక వాలి ఉన్న వాడల్లా, ముందుకు వంగి, ఆమె తన వైపు చూస్తున్నదేమోనని. ఆమె దృష్టి అతని వైపు లేదు. ఆమె చెబుతూనే ఉంది. "నాకు పై మెరుగులమీద, ఆకర్షణలమీద ఆకర్షణ ఎప్పుడో పోయింది. లేకపోతే ఎప్పుడో నాశనం అయిపోయి ఉందును. తోబుట్టువుల్లో మగ పిల్లలు లేకపోవటం, మగ పని ఆడపని చేసుకోవలసి రావటం, బస్తీలో పెరిగి, నాలుగూ చూడటం, అర్థంచేసుకోవటం, ఇవి నన్ను త్వరలోనే ఆకట్టుకున్నయ్. ఏ ప్రవాహంలోనూ పడకుండా కాపాడినయ్." ఆమె దృష్టి పెట్టె మీదనే ఉంది. ఆమె స్వరం కొంచెం ఆవేశంగా ఉంది.

ఒక్కసారి పూర్తిగా దగ్గి, గుండెలు తేలిక పరుచుకుందామనుకునే రోగిలా ఇంకా చెబుతూనే ఉంది "ఎన్నో ఆకర్షణలలో, చనువుగా, చొరవగా లాగి నాశనం చేస్తారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉండి దెబ్బతిన్నా క్షమించేటంత ఉదారులా ఉదాత్తులా చెప్పండి, మీరూ మీరూ నిర్మించిన సమాజమూ."

ఈ మాట అని వెనక్కు తిరిగింది. అది అతన్ని చురుక్కున కొట్టినట్లు అయింది. ఆమె అన్నది, "ఏ ఒక్కరి విషయమూకాదు చెప్పటం. మామూలు పద్ధతి చెబుతున్నాను. భ్రష్టం చేసేటప్పుడు చూపెట్టిన ఉదాత్తత క్షమించవలసిన అవసరం వచ్చినప్పుడు ఉండదుకదూ. అందుచేత కళ్ళని నమ్ముకుని భ్రమపడి, నాశనమై పోతే ఎట్లా చెప్పండి"

మగవాళ్ళ మీద పడ్డ ఈ తీరని అపవాదు, అతనికి గూడా తగిలింది. ఇంకేదో మాట్లాడుదామనుకున్నా, ముందు మరొకటి వచ్చింది. అన్నాడు, ఆడవాళ్ళలో మాత్రం లేరూ అట్లాంటి వాళ్ళూ, ఆడవాళ్ళు అంతకంటె ఎక్కువకదూ."

ఆమె సర్దటం మానేసి, పూర్తిగా వెనక్కి తిరిగింది, "ఉంటారు. ఎందుకు ఉండరూ. ఉన్నా మొదటి తరహావాళ్ళే ఉంటారు. రెండవ తరహావాళ్ళు ఉండరు. అదే ఆడవాళ్ళ బలహీనతో గొప్పతనమో, ఏదో ఒకటి అనండి. క్షమించే విషయంలో మాత్రం ఆడదానికి ఉండే శక్తి, మగవాడికి ఎప్పుడూ ఉండదు. అందుచేతనే వాళ్ళు ఇంకా ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. క్షమ, జాలి అనే పదార్థాలు విరివిగా, వితరణ చెయ్యగలిగిన జాతి దగ్గర, జాగ్రత్త ఉండకపోతే ప్రమాదమే" అన్నది.

అతను మధ్యలోనే అందుకోవటానికి ప్రయత్నించి, ఆమెని అక్కడదాకా చెప్పనిచ్చే అన్నాడు. "అయితే ఎంత తప్పు చేసినా, క్షమించమనే మీరు అంటారు" అంతకంటే ఎక్కువ అనలేకపోయాడు. శకుంతల మనస్సులోనూ, శకుంతల గొప్పతనం సగర్వంగా చెప్పుకునే నిర్మల ఎదుటా ఉండి అతన్ని మాటలు తెంచుకొని రానంత ఉద్వేగ పెట్టారు. ఇంకా ఏదో చాలా అందామనుకున్నాడు. కాని, ఏమీ అనలేకపోయాడు.

ఆమె అన్నది, "ఆ విషయం నేను ఏమీ అనను. ఆడది క్షమించినంత మగవాడు క్షమించలేడనే నేను అనేది" ఆమె మామూలు ధోరణిలోనే అన్నది. వాళ్ళిద్దరికీ సంబంధించే విషయంకాదు, అని ఆమె అనుకోటంతో ఆమె అతనివైపు పూర్తిగా తిరిగే మాట్లాడుతున్నది. ఆమే అన్నది, "పోనీయండి ఆ విషయం. వాదనకి అనవసరమైన విషయం అది"

అతను, ఆమె చెప్పిన విషయం ఆలోచిస్తున్నాడు. ప్రతివాదం చెయ్యటానికి సిద్ధపడిగాని, ప్రతివాదం చేసే ఉద్దేశ్యంతోగాని అక్కడికి రాలేదు. అంతకుముందు ఎప్పుడు మాట్లాడినా, తన విషయం ఏమాత్రం బైట పడకుండా తెలియటానికి అవకాశం లేకుండానే వ్యవహరిస్తూ వచ్చాడు. కాని, ఇప్పుడు ప్రతివాదంచేసి, శకుంతల విషయం బైటికి వస్తుందేమోననే భయం గూడా లేకపోలేదు. ఏమాత్రం వచ్చినా, నిర్మల ఇట్టే పసిగట్టేస్తుంది. ఆ అవకాశం ఆమెకు ఇవ్వటానికి ఎప్పుడూ ఇష్టం ఉండదు.

అక్కడినించి త్వరగా వెళ్ళిపోతే మంచిది అనుకున్నాడు. ఆమె ఏమీ సర్దుకున్నట్లు కనబడలేదు. ట్రైనుకి అట్టే ఆలస్యం లేనట్లు గుర్తుకి వచ్చింది. ఈసారి లేచాడు. "మీరు ఏమీ సర్దుకున్నట్లులేదు. నేను వచ్చి మిమ్మల్ని మాటల్లో పెట్టాను. వెళ్తాను", అని లేచాడు.

ఆమె మామూలుగానే ఉంది. ఏ రాగ ద్వేషాలు లేకుండా, ఉద్వేగం చల్లారిపోయినట్లుగా మాట్లాడింది. "లేదు, పూర్తి అయిపోయింది. కాఫీ పెట్టాను. తీసుకొస్తున్నాను. కూర్చోండి, కాఫీ త్రాగి వెళుదురుగాని" అని లోపలికి వెళ్ళింది. ఎప్పుడు కాఫీ పెట్టిందో గూడా అతనికి తెలియలేదు. అతను, ఆలోచనలన్నీ లోపలే ఉండి, ఏ ఒక్కదాన్ని గురించీ ఆలోచించలేక, చిక్కుపడ్డ దారపు కండెలో మొదలు ఎటూ అని చూసేవాడిలా కూర్చున్నాడు.

ఆమె కాఫీ కప్పు తీసుకొచ్చి, అతనికిస్తూ, అన్నది, "చాలా మాట్లాడామకదూ. ప్రసంగవశాత్తూ వస్తే, దాని

విషయం పూర్తి అయ్యేదాకా వదలలేం" అంత ఎక్కువ మాట్లాడినా, దానికి క్షమాపణగా చూసింది.

అతనికి ఆ విషయం నిజమేననిపించింది. క్రిందటి రోజు గూడా మనస్సు ఒక భావంలోపడి, దాని విషయం తేల్చుకునేదాకా వదలలేదు. ఇప్పుడు గూడా అట్లాగేఉంది. అప్రయత్నంగా మాట్లాడాడు. చిక్కుపడ్డ దారంలోనించి, ఏదో పుచ్చుకు లాగితే మరేదో తెగి వచ్చినట్లు వచ్చింది. "ఆఖరికి భరోసా మీద పెట్టిన విశ్వాసాన్ని, ఊడ్చి పారేసినా, నిస్సంకోచంగా త్రోసి పారేసినా క్షమించాలా" అన్నాడు.

"అక్కడే మనం పొరపాటు పడతాం అంటాను. ఆ విశ్వాసం ఉంచే చోట జాగ్రత్తగా చూసి ఎంచుకుంటే ఆ ప్రమాదం అసలు ఎప్పటికీరాదు. ఆ అవకాశాలు ఎక్కువగా ఉండనూ ఉండవు. కాని, బాధ్యత తెలిసిన వాళ్ళమీద విశ్వాసం ఉంచుతున్నామా, లేదా అనేది తెలుసుకొని బాధ్యత తెలిసిన వాళ్ళను వెతుక్కుంటే ఇక నిశ్చింతగా ఉండవచ్చు."

అతను బాగా అర్థమైనట్లు చూశాడు. ఆమె చెబుతూనే ఉంది. "ఆ నిశ్చింత జీవితంవస్తే ఇంకా కావలసినది ఏముంది. దానికోసమేగా అందరూ అన్ని పాట్లూ పడేది" ఆమె కంఠంలో ఆర్ద్రత కనిపించింది. "మీ కిచ్చిన దాంట్లో పదోవంతు గూడా చనువు ఇవ్వకుండానే, చికాకు పరిచేటంత స్వతంత్రం తీసుకోవటానికి ప్రయత్నించారు. బాధ్యత తెలిసిన వ్యక్తులు గనుక మీరు తీసుకో ప్రయత్నించారు." ఆమె ఇక అక్కడ ఉండలేక పోయింది. ఖాళీ కప్పు తీసుకొని లోపలికి వెళ్ళింది.

ఆమె తిరిగి రావటానికి కొంచెం ఆలస్యం పట్టింది. ఈ కొంచెం సేపట్లో అతను యుగాల ఆనందం పొందాడు, తను నిర్దిష్టంగా ఏమిటి అంటే చెప్పలేని సంతోషం అది. తన బాధ్యతని తన జాగ్రత్తని ఆమె పొగిడింది. దానికి ఆమె సంతోషించింది. శకుంతల ఒకసారి గుర్తుకు వచ్చింది. శకుంతలకు, నిర్మలకు తెలిసినంత తెలిస్తే, అసలు శకుంతల తన జీవితంలో ప్రవేశించకుండా, ఏ నిర్మలో ప్రవేశించిఉంటే, లేక నిర్మల ప్రవేశానికి అవకాశం ఇచ్చి ఉంటే........అతని మనస్సు బరువుగా ఉంది.

ఆమె తిరిగివచ్చి పెట్టె మూస్తున్నది. అతను అన్నాడు, "మీరు చెప్పిన బాధ్యత, బాధ్యత తెలిసిన వ్యక్తులకే అర్థమయ్యే విషయం. అది రెండు వేపులా ఉండకపోతే మీరు చెప్పిన నిశ్చింతరాదు. చింతే మిగులుతుంది."

అతనివైపు, ఈ మాటలు విని ఒకసారి చూసింది. తను చెప్పింది ఏమైనా అర్థమైందో, లేదో అని వెతికినట్లు చూసింది. అతను చెప్పిన దాంట్లో అర్థం ఏమిటో చూడటానికి ప్రయత్నించింది. ఆమెకు ఏమీ అర్థం కాలేదు, అన్నది. "మీరు చెప్పిన విషయం నిజమే. నా చిన్నప్పటి స్నేహితురాలు ఈమధ్య కలిసింది. ఆమెని మొగుడు వదిలేశాడు. బాధ్యతగల వాళ్ళు అయితే అట్లా చేస్తారా చెప్పండి"

అతనికి వదిలి పెట్టటం అనటంతోటే శకుంతలే గుర్తు వచ్చింది. అన్నాడు, "ఆమె ఏదో చేసి ఉంటుంది. లేకపోతే ఎందుకు అట్లా జరుగుతుంది." ఆమె వెళ్ళవలసిన టైం అయినట్లు, వచ్చిన ప్రసంగం కాలయాపన చేసేటట్లు ఇద్దరికీ అర్థమైంది. ఈసారి ఆమె అన్నది, "ఆఁ చేసే ఉంటుంది. పుట్టింటినించీ అతను తెమ్మన్నవన్నీ తీసుకరాకపోవడమో, మొగుణ్ణి వేళకు ఇంటికివచ్చి, తనను గూడా గుర్తు పెట్టుకోమనటమో, కాస్త దుబారా తగ్గించమనటమో, మీతో మాట్లాడుతుంటే ఇక ఇవ్వాల్టికి ప్రయాణం సాగినట్లే. మీరేమీ అనుకోకుండా ఉంటే–రిక్షా ఒకటి కేక వేసుకవస్తారూ"

అతను లేస్తూనే అన్నాడు, "ఇవిగాక చేసేవి ఇంకేవీ లేవా?" ఆమె నవ్వుతూనే అన్నది, "లేకేం. ఆ లిష్టు మీరు వచ్చేటప్పటికి నేను తయారు చేస్తాగా. మీరు వెళ్ళిరండి" అన్నది.

సంభాషణకు సంబంధించిన ఉద్రేకం ఇంకా అణగక పోయినా, మనస్సు అతనికి ఎంతో సంతోష పడ్డట్టు అనిపించింది. చివరి మాటల్లో నిర్మల తీసుకున్న చనువు, ఆమె చూసిన చూపు ఎక్కడో తగిలి, ఏదో అనుభూతిని గుర్తుకు తెస్తున్నయ్. ఆమె తీసుకున్న చనువు చాలా ఆనందంగా ఉంది. అతను వెళ్ళి రిక్షా పిలుచుకు వచ్చాడు. రిక్షాష్టాండులో ఒకటే రిక్షా ఉంది. ఇంకోటి గూడా ఉంటే బాగుండు ననుకున్నాడు. త్రోవలోనైనా దొరికితే బాగుండుననిపించింది.

రిక్షావాడు సామాన్లు రిక్షాలో పెట్టాడు. ఆమె తాళ వేసివచ్చి రిక్షాలో కూర్చుంది. అతను రిక్షాలో ఆమె కూర్చున్న ప్రక్కగాఉన్న అంచుమీద చెయ్యిపెట్టి అన్నాడు, "అక్కడ ఒకటే రిక్షా ఉంది". స్టేషనుదాకావచ్చి పంపించి వద్దామనే అతని ఉద్దేశ్యం ఆమెకి అర్థమైంది. అర్థంకాక మిగిలిపోయిన విషయం మరొక్కటిఉంది. దానికోసం అతని ముఖం చూడటానికి అవకాశం లేదు. అతను తన హృదయం తెలుసుకొని అంటున్నాడో, తెలుసుకోవటానికి అంటున్నాడో ఆమె నిర్ధారణ చేసుకోలేక పోయింది.

అతని చెయ్యిమీద తన చెయ్యి ఉంచి అన్నది, "ఎందుకూ అంత శ్రమ. నేను ఒక్కదాన్నే వెళ్ళ గలనుగా. దయ ఉంటే మీ బాధ్యతల లిస్టులోవేసి, ఒక ఉత్తరం ముక్క వ్రాయండి' ఈమాట అనే ఆమె ముఖం అతనికి కనబడకపోయినా, ఆమె కంఠస్వరంలోఉన్న ఆర్ద్రత మాత్రం అతనికి స్పష్టంగా తెలిసింది.

తన రెండో చెయ్యి ఆమె చేతిమీద వేసి నొక్కుతూ అన్నాడు, "నీకు తెలియదు నిర్మలా—ఆ విషయంలో నువ్వు తెలుసుకోవలసింది చాలా ఉంది."

రిక్షావాడు ఆలస్యం భరించలేక అన్నాడు, "బాబూ పోనిమ్మంటారా బండి టైము అయింది". వాడికి ఇట్లాంటివి అలవాటే అయినా, వాడికి నిత్య జీవితం ముఖ్యం. అతను 'ఆ' అన్నాడు.

ఆమె తన రెండో చెయ్యి అతని చేతిమీదవేసి, అదుముతూ అన్నది. రిక్షా కదిలింది. "ఇంకేమీ తెలుసుకోక్కర్లేదు, నేను తెలుసుకున్నది చాలు."

రిక్షా కదిలినప్పుడు చేతులు విడిబడిపోయినా, ఎప్పుడో కలిసిపోయిన హృదయాలు అతుక్కుపోయినయ్.

అతను రిక్షా వెళ్ళిన వైపే చూస్తున్నాడు. దూరంగా ప్రకాశిస్తున్న లైటు క్రిందిగా రిక్షా పోయేటప్పుడు, ఆమె ఇంకా వెనక్కు తిరిగే చూస్తున్నది, తను కనబడకపోయినా, తనవేపే చీకట్లోకి చూస్తున్నదని అతనికి అర్థమైంది. కాని, తను చీకట్లో ఎటువైపు చూస్తున్నాడో, ఆమెకు అర్థమైనా తెలియదు. తనను గురించి ఏమీ తెలియదు. తను ఏమీ చెప్పలేదు. ఆమె తనను గురించి ఏమీ దాచకపోయినా, తను, తనని గురించి ముఖ్యమైనది అంతా దాచాడు.

7

ఏ మాట విందామనుకొని, తన అయోగ్యత గుర్తుకు వచ్చి, వినటం అసంభవం అనుకొని సరిపెట్టుకున్నాడో, ఆ మాట విన్నాడు. ఆ మాట వినటం చాలా సంతోషంగా ఉన్నా, దానికంటె ఎక్కువ ఆనందం కలిగింది. ఇంతకుముందు ఏనాడూ కలగని ఆనందం కలిగింది. తను నెల నెలా తమ్ముల్లా, చెల్లెళ్ళ కోసం డబ్బు పంపటంలో ఉన్న తృప్తీ, తండ్రిబాధ్యతని తన మీద వేసుకుని, తండ్రికి గర్వకారణంగా ఉన్నాననే సంతోషం, శకుంతలతోటి గడిపిన జీవితంలో పొందిన ఆనందం, వీటన్నిటికంటె కొన్ని వేల రెట్లు ఎక్కువ ఆనందం కలిగింది. తనలో ఏదో లుప్తమైపోయింది అనుకున్నది పూరమైనట్లు, అసలు లుప్తమైపోలేదు అనుకునేంత ఆనందం కలిగింది.

తను గోపాలరావు కాకపోయినా, తనకు ఉంగరాల జుట్టూ, విశాలమైన ఛాతీ, సెరలిన్ చొక్కాయి ఏవీ లేకపోయినా, తన దగ్గరఉన్న వస్తువు, నిరుపయోగమైనది అని శకుంతల త్రోసి పారేసిన వస్తువు, ఎంతో యోగ్యమైనది, అవసరమైనదీ, విశాలమైనదిగా శకుంతలకంటె అందమైన నిర్మల ఆఖరిసారి స్పష్టంగా చెప్పివెళ్ళింది.

తనను గురించి నిర్మలకు ఏమీ ఎక్కువగా తెలియదు. అసలు ఏమీ తెలియనట్లే లెక్క. తనకు ఇంకా తమ్ముళ్ళు, చెల్లెళ్ళు ఉన్నారని, వాళ్ళకోసం తను నెల నెలా డబ్బు పంపుతున్నానని తప్ప ఇంకేమీ తెలియదు. అంతకంటె తను ఇంకేమీ చెప్పలేదు. ఆమె కూడా అదే చేస్తున్నది. ఇద్దరూ మితంగానే వ్యయం చేస్తారు. ఆమె వ్యక్తిగతమైన జీవితం తనకి తెలుసు. తన వ్యక్తిగత జీవితం ఆమెకు తెలియదు. అయినా తెలుసుకో నక్కర్లేదు అంది. తెలుసుకున్నది చాలు అన్నది.

తనకు జీవితంలో మొదటిసారిగా తెలిసింది, తనను ఒక అందమైన అమ్మాయి ప్రేమించింది అని. అతనికి ఆమె వెళ్ళిన ఆ మూడు రోజుల వింత ఏకాంతంలో, నిశ్చితంగా చెప్పలేని ఆనందం, అంతే నిశ్చింతగా నిర్వచించలేని బాధ కూడా తెలుస్తున్నయ్. మొదటిరోజు, రెండోరోజు బాధ ఏమీ తెలియలేదు గాని, ఆ మూడోరోజు తెలుస్తున్నది. అప్పుడు తలచిచూస్తే తెలిసింది కూడా, తన ఏకాంతంలోకి నిర్మలవచ్చి ఎక్కువకాలం కాకపోయినా, నిర్మల కనబడటం గూడా లేని ఆ ఏకాంతంవల్ల అని. మునుపటిలాగే ఏకాంతం దుర్భరంగా ఉంది. మునుపుఉన్న భావాలే రాకపోయినా, ఈ ఏకాంతం గూడా బాధాకరంగా ఉంది. మొదటి ఏకాంతానికి కారణమైన శకుంతలగాని, ఆమెని గురించి ఆలోచనలుగాని ఈ ఏకాంతంలో గుర్తు రావటంలేదు. ఈ ఏకాంతానికి కారణమైన నిర్మల, మాత్రమే మనస్సులో నిలిచిపోయింది.

ఇంత ప్రేమించిన నిర్మల ఎందుకు వెళ్ళిపోయిందో చెప్పలేదు. తనను గురించిమాత్రంకాదు. మరి ఎందుకో అడిగితే బాగుండిఉండేది అనిపించింది. కాని, అడగలేదు. ఎందుకో అర్థం కాలేదు. తను ఆపలేదు. ఆగిపొమ్మంటే ఆగిపోయేదో, లేదో తెలియదు. ఆగి, తను చెప్పదలచుకున్న విషయం చెప్పింతర్వాత ప్రేమించేదో, లేదో తెలియదు. అప్పుడైతే చెప్పేవాడు. కాని ఇప్పుడు చెప్పాలో లేదో తెలియటంలేదు. చెప్పకుండాఉంటే ఇబ్బంది. చెబితే ఆమె తను గూడా అయోగ్యుడు అనుకొని తన ప్రేమని తిరిగి తీసుకుంటే తను అది భరించలేడు. ఈ ఆలోచనలతో అతనికి పిచ్చి ఎక్కుతున్నట్లు అనిపించింది. కనీసం నిర్మల దగ్గర్నించి ఉత్తరంవస్తే బాగుండుననుకున్నాడు. తను ఉత్తరం వ్రాద్దామనుకున్నాడు. ఆమె అడ్రసుఇచ్చి వెళ్ళలేదు. తనకు ఆఫీసులో అడిగి తీసుకోవటానికి ఇష్టంలేదు. ప్రతిరోజూ ఉత్తరంకోసం ఎదురు చూశాడు. ప్రతిరోజు గూడా, కలిసి ఎన్నో రోజులు కాలేదు కాని, యుగాలు అయినట్లు ఉంది. ఆరోజే ఉత్తరం వచ్చింది. యుగాల తర్వాత వచ్చిన ఉత్తరం చదివాడు.

ఆ వచ్చింది ఆహ్వానం. ఆహ్వానంతోపాటు కలిసిన ఉత్తరం వాళ్ళ అక్కయ్య కూతురు బారసాలట. తప్పక రమ్మని వ్రాసింది. తప్పక వస్తారు కదూ, రారూ, అని ముగించింది. ఆ మాటల్లో ఆ ముగింపులో రిక్షాలో దూరంగాఉన్న లైటు క్రిందగా వెళ్తూ వెనక్కి తిరిగి చూసిన నిర్మల, తనని విశ్వసించి, ఇంకేమీ తెలుసుకో నక్కర్లేదు అనుకున్న నిర్మల కనిపించింది. తన బాధ్యత తీసుకోమని మౌన భాషలో చెప్పి వెళ్ళిన నిర్మల కనిపించింది. ఎక్కువగా కాకపోయినా, తియ్యగా, కమ్మగా ఉండేట్లు వ్రాసింది.

ఇంకా వ్రాసింది. తనకు, ఆమెకు వెళ్ళే రోజు జరిగిన సంభాషణ పురస్కరించుకున్నట్లు వ్రాసింది. మొగుడు వదిలేసిన తన స్నేహితురాలు, వాళ్ళ అన్నయ్య దగ్గర ఇంకా అక్కడే ఉందట. ఆమెని చూసినప్పుడల్లా ఏదో భయం, ఆ భయంలో నమ్మకంగా కనిపించే తనూ గుర్తు వస్తారట. ఆడజాతి నిరుపాయత, అసహాయతకు ప్రతిరూపంగా కనిపించే తన స్నేహితురాల్ని చూస్తే కానరాని భయ సందేహాలు మనసంతా ఆవరిస్తయ్యట. ఏమాత్రం లోట్లు కనిపించినా సహించకుండా నిర్దాక్షిణ్యంగా దండించే పురుష జాతి దయా ధర్మ భిక్షంలోపడి

ఉండవలసిన ఆడది, శిక్షాసుమ్రతి తెలిసి ఉండి గూడా ఏం అకార్యం చేస్తుంది చెప్పండి అని ప్రశ్నించింది.

తర్వాత తమాషాగా వ్రాసింది. తనకు నమ్మకం ఉన్నవి తమ జాతిమీద. మీరు వస్తారుగా మీరే అడుగుదురుగానిలెండి. ఏం తప్పుచేస్తే అంత శిక్ష వేశారు. నేను ఎప్పుడూ అడగలేను. అడగలేదు కూడా. అతను తెలుసుకోవలసిన విషయం అన్నట్లు ఇంకా వ్రాసింది. ఒక్క విషయం చెప్తాను. మీ దయాదాక్షిణ్యాలతో బ్రతకవలసినవాళ్ళు, మీరు లేకుండా బ్రతుకలేని వాళ్ళు, మీరు నిశ్చింతగా బ్రతుకనివ్వనివాళ్ళు, మీతో ముడిపడటం కోసం తప్ప, మీకోసం మీ తృప్తి సుఖాలకోసం తప్ప యితరత్రా ఏం చెయ్యగలరు. ఏ అకార్యం చెయ్యగలరో చెప్పండి. యుగాలుగా అలవాటైన, తప్పనిసరియైన ఈ అస్వతంత్రం నించి స్వతంత్రం కావాలి అని మీనించి తెగదెంపులు చేసుకుందా మనుకుంటే తప్ప యింకేం అకార్యం చేయుటానికి అవకాశం ఉంది. ఒకవేళ పొందినా, మీరు నిలవనివ్వని ఆ స్వతంత్రం మాత్రం ఎన్నాళ్లు ఉంటుంది. దాన్ని ఏ స్వైరవిహారంగానో పేరుపెట్టి, హైన్యంగా లాగేస్తారు. అది మాత్రం ఏం సుఖం? ఎవరి మెప్పుకోసం?

ఉత్తరం చదివినంతసేపూ ఆనందిస్తూ, మధ్యమధ్య కలుక్కుమని ఉలిక్కిపడ్డ ఏకీభూతమైన అతని అభిమానం నిర్మలమీద స్థిరీకృతమైంది. తన జీవితంలో అడుగుపెడదా మనుకునే నిర్మలను అడుగు పెట్టనిస్తే, యింతకుముందే అడుగుపెట్టి అది జారి ప్రక్కకు పడిపోయిన శకుంతలవల్ల ఉండే యిబ్బందిని గురించి ఆలోచించాడు. ఎంత ఆలోచించినా ఆలోచన తెగలేదు. ఇబ్బంది వస్తుందో రాదో తెలియదు. వస్తే ఏం చెయ్యాలో తెలియదు. ఎల్లా పరిష్కరించాలో అంతకంటే ఆలోచన రాలేదు. ఉభయ సంకోచాల మధ్యలో పడేనేమో, తండ్రి ఉత్తరం వ్రాసినా, నిర్మల తన జీవిత బాధ్యత తన మీద వదిలేసి నిశ్చింతగా ఉంటానన్నా గూడా, తన నిశ్చయం మనస్సు అడుగునించి తేలి పైకి రాలేదు. దానికి చాలా ఆలస్య మున్నట్లు అనిపించింది. తన ఆలోచన మార్చి యింకోటి ఆలోచించాడు.

వెళ్లవద్దు అని నిర్ణయం చేసుకున్నా, వెళ్లకుండా ఉండగలగటం అసంభవం అయ్యేదేమో. కాని అతను అంత అసంభవమైన పనికి పూనుకోలేదు. రెండు రోజులు సెలవుపెట్టి బయలుదేరాడు. వెళ్లటంలో గల మరొక ఉద్దేశ్యం కోసమే తను బయలుదేరుతున్నానని సమాధానపడ్డాడు. ఇంతదాకా నిర్మలకు చెప్పని విషయం, చెప్పకుండా జాగ్రత్తగా పరిరక్షించిన విషయం, చెప్పి ఆమెమీద దాని ప్రభావం ఎట్లా ఉందో చూసి, ఆమె అభిప్రాయం సేకరించటం, అది తన విషయంలో జరిగిందని నేరుగా చెప్పటమో, లేక వాళ్ల స్నేహితురాలి సందర్భంలో మాటాడటమో అక్కడికి వెళ్లాక ఆలోచిస్తాడు. ఇది ఎప్పుడో చెయ్యవలసిన పని. అప్పటికే చాలా జాప్యం జరిగింది. అదిగూడా తెలుసుకొనిగాని తనొక నిర్ణయానికి రాడు. అతను తృప్తిగానే బయలుదేరాడు.

మర్నాడు పది గంటలకు బారసాల. నిర్మల వెళ్లిన బండి ఉన్నదీ, తెల్లవారుఝామున బయలుదేరే మరొక బండి కూడా ఉంది. అయినా అతను ఆరోజు సాయంత్రమే అక్కడికి వెళ్లాడు. చీకటి పడింది. అయినా గుర్తులు వ్రాసింది గనుక నేరుగానే వెళ్లాడు. గేటు తీసుకొని లోపల అడుగుపెట్టేటప్పటికే వసారాలో మరొక రిద్ద రెవరితోనో మాట్లాడుతున్న నిర్మల లేచివచ్చి చేతిలో సంచి తీసుకుంది. హృదయమంతా ఒక్క మాటలో పెట్టింది. "వచ్చారా. అసలు రారేమోనని చాల బాధపడ్డాను." అతనికి మనసంతా సంతోషం పూసినట్లయింది. "ఎందుకు రాననుకున్నారు". అప్పటికి గేటు ముందు నుంచి వసారా దగ్గరగా వచ్చేశారు. యాదాలాభంగా వసారాలో ఉన్న మిగిలిన యిద్దరివేపు చూశాడు. మొదటి ఆమె మీదనించి రెండో ఆమె వైపు పూర్తిగా వెళ్లకుండానే చూపులు తిరిగి వచ్చేసినయ్. సంచి లోపల పెట్టి కుర్చీ తీసుక రావటానికి నిర్మల అతనికంటె ముందుగానే వసారా దాటి లోపలికి వెళ్లింది.

మసకగా ఉండి పెద్ద కాంతిగా లేని ఆ వెల్తురులో, మసిబారినట్లు ఉన్న చీరమధ్య కొడిగట్టినట్లు కాంతి విహీనంగా ఉన్న శకుంతల ముఖం గుర్తుపట్టటానికి, అతని చూపులను ఎక్కువ ప్రయత్నం చెయ్యటానికి అవసరం లేకపోయింది. శకుంతల యిక్కడా! అతని మనస్సు క్రితంసారి ఆమెతో ఆఖరిసారి ఉన్నప్పుడు, అయినంత అచేతనంగా మారిపోతున్నట్లుంది. కాని నిర్మల కుర్చీ తీసుకొచ్చి మారనివ్వలేదు. కుర్చీ క్రిందపెట్టిన చప్పుడుతో అతను నిర్మలవైపు చూశాడు. నిర్మల సముదాచారమైన పరిచయం మొదలుపెట్టింది. 'ఇది మా అక్కయ్య'. అక్కయ్యకు తన పేరు చెప్పలేదు. అతను చెయ్యెత్తి నమస్కరించాడు, చాలా కష్టంగా చేతులు కూడదీసుకుని. శకుంతలవేపు తిరిగి పరిచయం చెయ్యబోతూ చెప్పింది, "వీరు ప్రసాదరావుగారు" అతనివైపు తిరిగి చెప్పింది, "ఈమె శకుంతల. నేను చెప్పానే, మా స్నేహితురాలు.

ఆమె చెప్పిన మాటలు అతనికి వినబడ్డయ్యో లేదో గాని, చేతులు మాత్రం జారి, ఇక నిలవలేమన్నట్లు ఎప్పుడో యథాస్థానానికి వెళ్లిపోయినయ్యి. శకుంతల మాత్రం చేతులెత్తి నమస్కరించింది. సముదాచారం సరిగ్గా పాటించటం అతనికి అలవాటులేని విషయమేనని తెలిసిన నిర్మలకు అతను ఏమీ మాట్లాడకపోవటం క్రొత్తగా కనబడలేదు.

ఏమాత్రం తొట్రుపాటు కనబడకుండా శకుంతల నిర్మలవైపు తిరిగి, "నేను వస్తానే నిర్మలా" అంటూ వెళ్లటానికి వెనక్కి తిరిగింది.

చనువుగానే అంది నిర్మల "అదేమిటే, అల్లా పారిపోతా నంటావు. కాస్సేపు కూర్చో" అన్నది. "కాదే పనిఉంది వెళ్తాను" అన్నది శకుంతల ఎటువైపు చూడకుండా. అప్పటికే నిర్మలవాళ్ల అక్కయ్య కాఫీ తీసుకొస్తాను అని చెప్పి లోపలికి వెళ్లటం ఎవరూ పూర్తిగా విన్నట్లు లేదు. లేక విని ఊరుకున్నారో. నిర్మల అన్నది "ఆయన గూడా వచ్చారా, కాఫీ

తీసుకొస్తాను. ఉండు, కాఫీ తీసుకొని వెళ్దువుగాని" అని లోపలికి వెళ్లబోయింది.

లోపలికి వెళ్లబోయే నిర్మలను పట్టుకొని ఆపి శకుంతల అన్నది, "కాదే వెళ్తాను, తర్వాత వస్తాను" అని వెళ్లిపోయింది. ఎప్పుడూ తనమాట కాదనకుండా ఉండే శకుంతలని, వెళ్లిపోతుంటే ఒకసారి చూసి "కాఫీ తీసుకొస్తాను" అని ప్రసాదరావుకి చెప్పి లోపలికి వెళ్లింది.

ప్రసాదరావు ఎటువైపూ చూడటంలేదు, ఏమాటా వినిపించుకోవటమూ లేదు. అతను ఒక సందేహంలో పడి దాన్నించి బయటపడటానికి ప్రయత్నిస్తున్నాడు.

నిర్మలకు అంతా తెలిపి, యీ ఆహ్వానం పంపిందా! నిర్మలకు అంతా పూర్తిగా తెలుసా అని. కాని ఆ పరిచయం చేసే పద్ధతిలో అదేమీ గమనించినట్లు లేదు. గమనించే స్థితిలో లేడు. అయినా ఆడవాళ్లని గురించి నిర్మల పరిచయంతో కాస్త కప్పబడి, పూర్తిగా మారని అతని అభిప్రాయం వెంటనే తిరిగి వచ్చింది. శకుంతల మాత్రం పట్టుబడేదాకా కనిపించిందా? తను అనుమానించాడా? ఇంకాసేపు ఉండమని శకుంతలను బలవంతంచేసే నిర్మల ముఖంలో, యాదాలాభంగా చూశాడు గనుక ఏం ఉన్నదో పోల్చుకోలేక పోయాడు. శకుంతల ముఖం అటువైపు తిరిగి ఉన్నది.

నిర్మల త్వరగానే కాఫీ తీసుకొచ్చింది. అతను కాఫీ త్రాగుతుంటే అన్నది, శకుంతల ఆమె మనస్సులోనించి పోయినట్లు లేదు. "చూశారా? ఏ అకార్యం చేసినట్లు కనిపిస్తున్నది? ఎప్పుడూ దైన్యంగా, సామాన్యంగా, జీవితంలో అంతా పోగొట్టుకున్నట్లు ఉంటుంది."

అతను యాంత్రికంగా అన్నాడు. "ఏదైనా జరిగిన తర్వాత మనుషులు ఎట్లా ఉంటారు ఏమీ జరగనట్లే ఉంటారా" అతను నిర్మల కళ్లలోకి చూస్తూనే ఉన్నాడు, తన సందేహానికి ఏమైనా సమాధానం దొరుకుతుందేమోనని. ఉంటే రాబడదామనే ఉద్దేశ్యంతోటే మాట్లాడటానికి మొదలుపెట్టాడు.

కాని ఆ అవకాశం లభించలేదు. నిర్మల కళ్లలో తనకు పనికివచ్చే భావం ఏమీ కనబడలేదు. లోపలినించి కేక విని వచ్చి నిర్మల లోపలికి వెళ్లింది.

తను నిర్మల బాధ్యత స్వీకరిస్తే, శకుంతలవల్ల యిబ్బంది మాట అల్లా ఉంచి, ఏమీ అవకముందే శకుంతల అడ్డుగా వచ్చి నిల్చింది. ఇదంతా ఏదైనా మంత్రాంగమో, అనుకోనివిధంగా ఉండే సంఘటనో గూడా తెలియటంలేదు. శకుంతల నిర్మలకు స్నేహితురాలు కావటం, అయినా నిర్మల శకుంతలని మొగుడు ఎందుకు వదిలిపెట్టాడు అని అడక్కపోవటం, అడగకపోయినా శకుంతల స్నేహితురాలికి చెప్పకపోవటం, తను వచ్చేటప్పటికి ఆమె ఊహించటానికి వీలు లేనట్లుగా అక్కడ ఉండటం, యివన్నీ మామూలుగా జరిగే విషయాలు కావు. అయినా జరిగాయి. మామూలుగా ఏ ఆడదీ, మొగుణ్ణి వంచించటం, అందులో శకుంతల వంచించినట్లు నమ్మకంగా వంచించటం గూడా తను మామూలుగా వినాలేదు, చూడనూ లేదు. అయినా జరిగింది.

మిగతావన్నీ సరిపెట్టుకున్నా ఒక్క విషయం మాత్రం సరిపెట్టుకోలేక పోతున్నాడు. నిర్మలకు ఏమీ తెలియకుండా ఉంటుందా? శకుంతల దగ్గర్నించి ఏమీ గ్రహించకుండా ఉంటుందా? మిగతా అన్నీ సంభవాలతోపాటే, అదీ సంభవమేననిపించింది. తను మాత్రం చెప్పాడు యిన్నాళ్లనించీ? తన దగ్గర్నించి మాత్రం గ్రహించిందా? తనే యివ్వాళ చెప్పటానికి వచ్చాడు. ఆ వచ్చింది తన అసమర్థతని గురించి చెప్పటానికి వచ్చాడా? ఆ వంచకి వంచనని గురించి చెప్పటానికి వచ్చాడు. శకుంతలా అంతే! ఏమీ చెప్పిఉండదు. చెబితే మాత్రం తన తప్పుచెప్పి తనను న్యూనత పరచుకుంటుందా? చెబితే అంతా తనమీదనే, తప్పంతా తనమీదనే పేర్చి చెప్పి ఉంటుంది. వాళ్లయింట్లో గూడా అదే చెప్పిఉంటుంది. లేకపోతే వాళ్లవాళ్ల తన దగ్గరికి రాకపోయారా. తన దగ్గర ఉండటం కంటె చచ్చిపోవటానికి సిద్ధపడతాను అని చెప్పి ఉంటుంది. లేకపోతే యీ రెండేళ్ల వాళ్ల ఎందుకు ఊరుకుంటారు? తను కిరాతకుడుగా, రాక్షసుడుగా చిత్రించి ఉంటుంది.

దాంతో అతని కోపం శకుంతలమీద కట్టలు తెంచుకొని ప్రవహించింది. తననీ, తన పరువుప్రతిష్టల్నీ, తన జీవితాన్ని సర్వనాశనం చేసింది కాకుండా, తనని సరిగ్గా అర్థం చేసుకోనివ్వటానికి గూడా అవకాశం లేకుండా, తన జీవితం పునర్నిర్మించుకోవటానికి అవకాశం లేకుండా యిక్కడ దాపురించింది. తన జీవితానికి అశనిపాతంలా దాపురించింది.

వాళ్లనాన్న వచ్చిన సవ్వడి విని నిర్మల రావటం, తండ్రికి పరిచయం చెయ్యటం, అన్నీ సవ్యంగానే జరిగినయ్. తనూ గూడా అన్నీ యాంత్రికంగానే, అయినా సవ్యంగానే జరిపాడు. మనస్సుకి ఎప్పుడో తప్ప, మిగతా సాధారణ పరిస్థితుల్లో తప్ప, తనమీద అధికారం లభించదు. దేనిలోనూ లోపం రాలేదు. ఇంతకంటే మరీ విపత్కర పరిస్థితుల్లోనే యాంత్రికంగా పనిచేశాడు.

భోజనం చేసిన వెంటనే బడలికగా ఉందని, తను తనకై నిర్దేశించిన గదిలో విశ్రమించాడు. అతని విలువ తెలిసిన నిర్మల అక్కగారు గాని, తండ్రిగాని అతన్ని విసిగించటానికి ప్రయత్నించలేదు. నిర్మల బెజవాడలో తీసుకున్నంత స్వతంత్రం యిక్కడ తీసుకోలేదు. అయినా ఒకసారి వచ్చి అడిగి వెళ్లింది. తలనొప్పిగా ఏమన్నా ఉందా అని, ఉంటే అమృతాంజనం తెస్తానని. అఖ్కర్లేదని ఆమె వెళ్లిన వెంటనే తను మళ్లీ ఆలోచనలో పడ్డాడు, తెల్లవారబోతుండగా చంటివాడి తండ్రి వచ్చాడు. ఆయన వచ్చినప్పుడు గాని ప్రసాద్‌రావుకి అంతదాకా తను మేలుకొనే ఉన్నానని తెలియలేదు. ఆయన కాస్త హడావుడి మనిషి. కాఫీలు పూర్తి అయ్యే లోపలే కాస్త అందర్నీ తొందరపెట్టి, పెందరాడే కాఫీ త్రాగి

కావలసినవి తీసుకురావటానికి బజారుకు వెళ్లాడు. మామ గారు వెంట వస్తానంటే అక్కర్లేదని, ఆడవాళ్లవెంట వెళ్లి పిలుపులూ అవీ కానిమ్మని వెళ్లిపోయాడు.

శకుంతల మామూలుగానే వచ్చింది. నిర్మల తనే వద్దామనుకుంటున్నానని చెప్పింది. తన పెద్దక్కయ్య, చెల్లెలూ రావటంలేదని కూడా చెప్పింది. ఆలోచనలలో సతమత మవుతున్న ప్రసాదరావు యిది గమనిస్తూనే ఉన్నాడు.

నిర్మల అన్నది, "ఇంకా నాలుగు యిళ్లూ మిగిలిఉన్నయ్, పిలిచివద్దాం రావే. బట్టలు మార్చుకో". శకుంతల నిష్కర్షగానే చెప్పింది. "అవసరంలో సాయపడదామనే వచ్చాను. ఇంకేమన్నా పని ఉంటే చెప్పు. చేస్తాను. పిలుపులికి మాత్రం నేను రాను."

నిర్మల తనకు అర్థమైనట్లు చెప్పింది. 'ఫరవాలేదు రావే. నిన్ను వేసే ప్రశ్న లన్నిటికీ నేను సమాధానం చెబుతాగా. పద లోపలికి, ఆ కనకాంబరం చీర కట్టుకుందువుగాని"

ఈ మాటలు దూరంగాలేని, తలుపులు తెరిచిఉన్న గదిలో కూర్చొనిఉన్న ప్రసాదరావుకుకూడా వినిపించినయ్. అడిగినవాళ్లకీ, అడగనివాళ్లకీ, తనని గురించీ, బాధ్యతలేకుండా తనను వదిలిపెట్టడాన్ని గురించీ, తన నిర్దాక్షిణ్యం గురించీ చెప్పి తన వంచనని, తనమీదకి నెట్టుతున్నదన్నమాట. ఎదటివాళ్లు వేసే అడ్డప్రశ్నలకి, నిర్మల సమాధానం చెబుతుందన్నమాట సవ్యాఖ్యానంగా. ఇంతకుముందే మగవాళ్ల నిర్దాక్షిణ్యం గురించి నిర్మల లెక్చర్లు చాలానే యిచ్చింది. ఆడవాళ్లు ఏం చేస్తారు, ఏం చెయ్యగలరో తెలియని, వూహించలేని నిర్మల తెలిసింది కాస్త చేసి వూరుకుంటున్నది. ఆడవాళ్ల గొప్పతనం, క్షమ మగవాళ్ల నిర్దాక్షిణ్యం బాకావేసుకొని చెప్పి వస్తుంది.

వాతావరణం అంతా అట్లా మారి ఉంది. ఆ మారిన వాతావరణంలో తను అతనే అని తెలియదు కాని, తెలిస్తే తను చెప్పినా సరే శకుంతల చేసినపని ఎవరూ నమ్మరు. ఆమె వంచన, తను నిజంగా చెప్పే ఆమె వంచన, యింతకుముందే తన నిర్దాక్షిణ్యంతోనూ, ఆమెలో కలిగిన జాలితోనూ ఉన్న ఎవరి హృదయాలలోనూ చోటు చేసుకోలేదు. ఆడవాళ్ల బొంకులు వాళ్ల కన్నీళ్లు అన్నీ కలిపి నిజం కంటే బలీయంగా పనిచేస్తయ్. ఆ విషయం అప్పుడే అతని వూహకు వచ్చింది. వాళ్లు రాక్షసులు. వాళ్లు శూర్పణఖలు.

నిర్మల శకుంతలని బలవంత పెడుతూనే ఉంది. శకుంతల రానంటూనే ఉంది. అది చూసి వాళ్ల అమ్మ అన్నది : "పోనీ నువ్వూ, అక్కయ్యా కలిసి ఒక్క నిముషంలో పోయి వచ్చెయ్యకూడదూ. ఏదో చికాకుల్లో ఉన్న ఆ అమ్మాయిని బలవంత పెట్టటం ఎందుకూ." ఇంకా ఆమె పైకి వినపడేట్లుగానే అనుకుంది. "పెద్దమ్మాయి, జయ వచ్చిఉంటే యీ యిబ్బంది లేకపోయేదిగా." ఆమె వాళ్లకు చెప్పాలనే అన్నది : "శకుంతల చంటివాణ్ణి చూస్తూ నాకు సాయం ఉంటుంది, మీరు త్వరగా వెళ్లిరండి". ఈ మాటలకి నిర్మల వాళ్ల అక్కయ్య చాలా సంతోషించింది. పేరంటానికి అన్నా, పిలవటానికి అన్నా, ఆడవాళ్లు మరింకేదైనా మరిచిపోయేటంత సంతోషపడతారు.

దాంతో నిర్మల, వాళ్ల అక్కయ్య చంటివాడి బాధ్యత తల్లిమీదా, శకుంతలమీదా వదిలేసి, వాన వస్తున్నట్లు ఉంది తడవబోకండే, అసలే పచ్చి ఒళ్లు, అనే సలహా ఒక్కటే పుచ్చుకొని, వాన వచ్చేదాకానా, యిట్టే తిరిగి వచ్చెయ్యమూ అని, వాన వచ్చినా తడవం అన్నట్లు ధైర్యం చెప్పి వెళ్లారు, తండ్రిని వెంట బెట్టుకొని.

కాని ఆ వద్దామనుకున్న వానకి మాత్రం వాళ్లకుండే ఖాతరు ఉన్నట్లు కనబడలేదు. దాని మానాన అది ఎవరేమనుకున్నా సరే అన్నట్లు రానే వచ్చింది, సబ్బంది చూడకుండా. వంటింట్లో మడి గట్టుకున్న నిర్మల వాళ్ల అమ్మ, ఉయ్యాలలో హాయిగా చల్లగాలికి నిద్రపోదామని ప్రయత్నించే చంటివాడూ, అవీ, యివీ అందించటానికి శకుంతల, కోసం మాత్రం మిగిలిపోయిన ప్రసాదరావు ఆ యింట్లో తీరికలేకుండా మిగిలిపోయారు.

లోపల ముసిలామె పురమాయించిన పనుల్తో, శకుంతల ప్రసాదరావు ఉన్న గది ప్రక్కగానే తిరగవలసి వచ్చింది. ఆమె అటు తిరిగినప్పుడల్లా, ఆమె అడుగుల చప్పుడు వినిపించినప్పుడల్లా, ప్రసాదరావులో కోపం భరించలేనంతగా విజృంభిస్తోంది. నిర్మల సాన్నిహిత్యంతో రూపరహితంగా ఉండిపోయి, అసలు పూర్తిగా వెళ్లిపోయాయనిపించిన కోపద్వేషాలు ఎక్కడికీ పోలేదు. ఏం చెయ్యమంటావో చెప్పు అని వచ్చి కూర్చున్నయ్.

నిర్మలా, శకుంతలా, శూర్పణఖా, యిప్పుడు ప్రసాదరావుకి అంతా ఒకటే. ఇప్పుడు వాళ్ల ఖాతరు లేదు. ఖాతర చేస్తున్నదల్లా తనలో విజృంభిస్తున్న కోపద్వేషాల్ని గురించే. బైటికి వెళ్తే కొంత సుఖంగా ఉంటుం దనుకుంటున్నాడు. బైటంతా జోరుగా కురిసే వాన చల్లగా ఉంది. తను వర్షానికీ ఖాతరు చెయ్యాలి. లోపల ఉన్న క్రోధ ద్వేషాలు మాత్రం దేనికీ ఖాతరుచేసేట్లు లేవు. శకుంతల అడుగుల చప్పుడు వినిపించినప్పుడల్లా అతను కదిలిపోతున్నాడు.

వచ్చిన అతిథిలాంటి చుట్టంయొక్క విలువ తెలిసిన నిర్మల తల్లికి గూడా వర్షం ఆటంకంగానే ఉంది. అతనికి కాఫీ తీసుకెళ్లి యివ్వటానికి నిర్మలని రాకుండా ఆపివేసింది. తడి గుడ్డలతో తను అతని ఎదుటికి రాలేదు. కాఫీ యివ్వకుండా ఉండటానికి వీలులేదు. మర్యాదకు మారుపేరుగా వ్యవహరించబడే కాఫీ ఆ మర్యాదని కాస్త తగ్గించటం, పెంచటం గూడా చేస్తుంటుంది. ఇప్పటివాళ్ల పరిస్థితితో తగ్గటం అంటే నిర్మల శాశ్వతంగా ఏకాకిగా ఉండిపోవటం అన్నమాట. మర్యాద పెరిగితే అది ముందు కొంత మంచికి దోహదం చెయ్యవచ్చు. కేవలం కాఫీకి యింత శక్తి లేకపోయినా, కాఫీ మర్యాదకి ఒక భాగమే అయినా మర్యాదకోసం కాఫీ యిచ్చి తీరాలి. మర్యాద నిలబెట్టుకొని తీరాలి. ఆ విషయం ఆమెకి బాగా తెలుసు.

కనీసం వర్షంలోకి వెళ్తేనన్నా తగ్గి ఉండే లోపల ముసురుతున్న కోపద్వేషాల మధ్యలో ఉడికిపోయి బైటికివచ్చే వేడి నిశ్వాసాల దగ్గరికి, బైట వర్షధారలో తడవని, లోపల దైన్యం, సంకోచాలలో తడవకుండాలేని శకుంతల, అణచుకోలేని వేడిని బైటికి తరుముతుండే కాఫీ కప్పుతో వచ్చింది. అతను కూర్చున్న మంచం దగ్గిరగా, దూరంగా ఉన్న స్టూలు ఒక చేత్తో లాగి దానిమీద కప్పు ఉంచుతూ అన్నది "ఇదుగో కాఫీ తీసుకోండి."

క్రుద్ధుడై ఉన్న ప్రసాదరావు అన్నాడు "అయితే అందరికీ నేను క్రూరంగా నిన్ను వదిలేశానని చెబుతున్నావన్నమాట."

ఆమె తెల్లబోయి, గర్జిస్తున్నట్లు ఉన్న అతని ముఖంవేపు ఒకసారి చూసి, తల దించుకొని అన్నది "నేను ఎవ్వరికీ ఏమీ చెప్పలేదు."

"చెప్పలా ! చెప్పకుండానే వాళ్లంతా అనుకుంటున్నారు. నువ్వు ఎందుకు చెప్పలేదు, తప్పంతా నాదేనని, నేనే కారణం అని."

ఈ మాటలు అనకముందే అతని చేతులు బల్లమీదికి వంగి కాఫీ కప్పు ఉంచి పైకి లేవబోతున్న ఆమె బుజాలని బలంగా ముందుకూ వెనక్కూ వూపుతున్నయ్.

ఆమె నిశ్చలంగా అన్నది, "అదే శ్రేయస్కరం" అని. శకుంతల అతనివైపే చూడలేదు. వాళ్లని అనుకోనిమ్మని వూరుకున్నాననటంతో అతని ప్రకృతి విజృంభించింది. తన గౌరవంమీద ఉదాసీనత చూపిన ఆమె భుజాలమీద నుంచి అతని చేతివ్రేళ్లు ఉదాసీనంగా కాకుండానే గొంతుదాకా జరిగినయ్. అతను అన్నాడు "ఎవరికి శ్రేయస్కరం. నాకా, నీకా" వ్రేళ్లు బలంగా కదులుతున్నయ్. ఆమె తల ఎత్తలేదు. అతని క్రోధమంతా చేతులూ, వ్రేళ్లు భరించలేక పోతున్నయ్. అయినా ఆమె మాత్రం అతని చేతుల వత్తిడి, వ్రేళ్ల తాకిడి భరిస్తూనే ఉంది. భరించటానికే ఉన్నట్లు నిశ్చలంగానే ఉండి అన్నది, తల ఎత్తకుండానే.

"మీకే."

అతనికి ఆ మాట స్పష్టంగానే వినిపించింది. ఆశ్చర్యం వేసింది. చేతులు వెనక్కు జరిగి తిరిగి వచ్చినయ్. ఆమె చెబుతూనే ఉంది. "ఆ అనుకునే ప్రతివాళ్ళూ అనుకుంటూనే ఉంటారు. దూరానికి వినపడేలాగా గూడా అంటారు. ఇదేదో చెయ్యకపోతే వదిలేస్తాడా అని. అది చాలు ప్రతి నిమిషం నా పతనం గుర్తు తేవటానికి, మీ గౌరవం పెరగటానికి."

తన ఆవేశంలో విన్న ఆ మాటలు అర్థంచేసుకోవటానికి అన్నట్లు అతను తిరిగి ప్రక్కమీద సరిగ్గా కూర్చున్నాడు. ఆమె అప్పటికే ఒకసారి గుమ్మంవైపు చూసి తిరిగి అతని పాదాలు తాకుతూ అంది. "మీరు క్షమించారు, అది చాలు. క్షమించరాని నాకు, క్షమించలేని యీ సమాజం మధ్యలో జీవితం మొండిగా లాగటానికి, చావలేని నాకు, బ్రతకటానికి ఆ తృప్తి ఒక్కటే చాలు."

అతనికి తన ముఖం కనబడకుండా తిరిగి వెళ్లిపోటానికి వెనక్కు తిరిగింది. అతను ఉదుటున ఆమె చెయ్యి పట్టుకుని "శకూ" అన్నాడు. అతని నోటివెంట మాట రావటంలేదు. ఆమె అతనివైపు తిరిగింది. చేసిన తప్పుకు క్షోభించిపోయి క్షమారహితమై ఆమె కళ్లలో నించి జారే దైన్యం, నిస్సహాయత అతనికి కనబడ్డయ్. అతని చెయ్యి శకుంతల చేతిని యింకా బలంగా నొక్కుతున్నది.

చేయి విడిపించుకోవటానికి ప్రయత్నంచేస్తూ అన్నది ఛీ, ఛీ! వెర్రి వ్యామోహంలో పడి నేను నాశనమైతే; అది తెలిసిన తర్వాత గూడా మిమ్మల్ని నాశనం కానిస్తానా, అల్లా ఎప్పుడూ జరగనివ్వను. నిర్మలతో మీరు సుఖపడతారు. నిర్మలకు నాలాంటి వెర్రి వ్యామోహం లేదు. ఎప్పుడూ పడదు."

మాటలు వింటూంటే చేతులు గూడా పరధ్యాన్నంగానే ఉంటయ్. ఆమె చెయ్యి జార్చుకొని వెళ్లిపోయింది. అప్పటికే గదిలోకి వెళ్లిన ఆ కొద్ది నిముషాలలోనే భయసందేహాలతో తనకు తెలిసినా, శకుంతల ఏ దొడ్లోనో ఉన్నట్లు పిలిచిన నిర్మల వాళ్ల తల్లి కేక అతనికి స్పష్టంగా వినిపించింది. కేక వేసింది నిర్మల తల్లి అయినా, కేక వేసింది నిర్మలకోసమైనా, ఆ కేక అనిర్వాచ్యమైన మరో ప్రపంచం నించి అతన్ని యీ ప్రపంచంలోకి పడేసింది. అతను లేచి గుమ్మందాకా వెళ్లి ఒకసారి వంటింటివేపు, ఒకసారి బైటవేపు చూచి వచ్చాడు. అక్కడ అంతా మామూలుగానే ఉంది. ఎక్కడా ఏమీ జరిగినట్లు లేదు. అతను తిరిగి వచ్చి ప్రక్కమీద కూర్చున్నాడు.

క్షణంలో మెరుపు మెరిసి, మాయమైనపుడు చుట్టూ ఉన్న అంధకారం మధ్యలో గూడా మనస్సులో మాత్రం ఆ మెరుపే మెరుస్తుంది. అతను మంచంమీద కూర్చుంటే విద్యుల్లతలా, మనస్సులో మెరిసిన సందేహం అడిగింది "నువ్వు నిజంగా క్షమించావా ?"

తను క్షమించాడో లేదో, క్షమాపణ అంటే ఏమిటో అనే విషయం తేల్చుకోనీకుండానే, వర్షాన్ని పరిపూర్తిగా తగ్గనివ్వకుండానే పేరంటానికి వెళ్లినవాళ్లు బజారుకు వెళ్లిన చంటివాడి తండ్రీ అంతా వచ్చారు. వర్షం ముందంత కుండపోత పోయకపోయినా, సన్నగా పడుతూనే ఉంది. అతని మనస్సుమీద గూడా పెనుతుఫాను తగ్గినా సన్న, చిన్న ప్రశ్నల తుంపర మాత్రం పడుతూనే ఉంది.

తర్వాత కార్యక్రమం అంతా సవ్యంగానే, మామూలుగానే జరిగిపోయింది. భోజనాలు అయి మగవాళ్లు విశ్రమించారు. ఆడవాళ్లు విశ్రాంతిలాంటి కబుర్లాడుకుంటున్నారు, విశ్రాంతికోసం.

ప్రసాదరావు తన ప్రక్కమీద మేలుకొనే పడుకున్నాడు. హడావుడిచేసే చంటివాడి తండ్రి భోజనాలు చేసిన వెంటనే హడావుడి అయిపోయినట్లు, హడావుడిచేసి విశ్రాంతి తీసు

కున్నట్లు రాత్రంతా నిద్రలేకపోవటంవల్లనేమో ప్రసాద రావుని విసిగించకుండా నిద్రపోయాడు. ముసలాయన ఎక్కడికో వెళ్లాడు. వర్షం తగ్గిపోయింది' పోతూ పోతూ కనపడ్డ వాటిని, ఖాళీగా ఉన్నవాటినీ నింపి పోయేటట్లు. ప్రసాదరావు ఖాళీగా ఉన్న మనస్సును కూడా ఆగిపోయిన యింకో వర్షం నింపే పోయింది.

ఏం మాట్లాడుకుంటున్నారో సరిగ్గా వినపడకపోయినా మాట్లాడే నిర్మల గొంతు, మాట్లాడలేక ఓరగా, మర్యాదగా వినవస్తున్న శకుంతల గొంతు మధ్య మధ్య వినిపిస్తున్నయ్. లోపల పడ్డ ప్రశ్న జల్లులు అంతా ఒకే పెద్ద ప్రశ్నగా ఘనీభవించినట్లు ఉంది. అది అతనికి భరించలేనట్లు అనిపించింది. తను నిజంగా క్షమించాడా? క్షమించటం అంటే ఏమీ జరగనట్లే, అంతా మరిచిపోయినట్లే సమాధానపడి, శకుంలతో కొత్త జీవితం ప్రారంభించటమా ?

సమాధానంకోసం వెతుక్కొంటున్న ప్రసాదరావుకి, సమాధానం యివ్వలేని ఆ ప్రశ్న, సమాధానంరాని ఆ వాతావరణం, అన్నీ అక్కడ తను ఉండటానికే అవకాశం లేనంత చికాకు పరుస్తున్నయ్. తను తీరిగ్గా సమాధానం వెతుక్కోవాలి, లేక పోతే యీ అశాంతితో కష్టం.

తీరిగ్గానే పని ఏమీ లేకుండానే పడుకున్న ప్రసాదరావు, తీరిగ్గా సమాధానం వెతుక్కోవటానికి ఆ దొరికిన సమాధానంతో కలిగిన అశాంతి పోగొట్టుకోవటానికి బయలుదేరాడు.

అర్ధాంతరంగా బట్టలు వేసుకొని సంచితో బయటకు వచ్చిన ప్రసాదరావునుచూసి అందరూ ఆశ్చర్యపడ్డారు. నిర్మలే నంబాళించుకొని అడిగింది. "ఇదేమిటి యీ బయలుదేరటం."

అతను నవ్వు తెచ్చుకొని చెప్పాడు "వచ్చిన పని అయిపోయిందిగా."

"పోనీ రాత్రిబండికి వెళ్లకూడదా" అంది నిర్మల, ఈ బయలుదేరటం ఎందుకో, ఆగటానికి ఏంచెయ్యాలో వెంటనే తోచక.

"మీ నాన్న ఎక్కడికి వెళ్లారే ?" అన్నది నిర్మల తల్లి. ఆయనైతే సర్ది చెబుతారనే ఉద్దేశ్యంతో. ఆమె శకుంతల వైపు ఒకసారి అనుమానంగా చూడటం పట్టించుకున్న ప్రసాదరావుకి తప్ప పట్టించుకోని ఎవరికీ తెలియదు.

"అక్కర్లేదండీ, ఏదో పనిమీద వెళ్లిఉంటారు. వస్తే చెప్పండి" అంటూనే గుమ్మంవైపు నడిచాడు. అర్థంలేని ప్రసాదరావులో వచ్చిన యీ అర్థంకాని మార్పు తెల్లబోయి చూస్తూ నిర్మల అతని వెంట వీధిగుమ్మందాకా నడుస్తూ అన్నది "ఏ విషయంలో లోపం జరిగినా క్షమించండి. ఈ వెళ్లిపోవటానికి కారణం అదే అయితే" అంది.

గుమ్మందాటిన ప్రసాదరావు, గుమ్మంలోకి వచ్చి ఆగిన నిర్మలని ఒకసారి తిరిగి చూశాడు. నిర్మల వెంటనే వచ్చి గుమ్మానికి దూరంగా నిలబడిపోయిన శకుంతల గూడా కనిపించింది.

ప్రసాదరావుకి ఆమె అన్న మాటలు వినిపించినయ్యో లేదో తెలియదు. వినిపించింది తనతోపాటు గుమ్మందాటిన ప్రశ్న ఒక్కటే, 'తను క్షమించాడా."

గుమ్మంలో స్థానంలేని శకుంతలవైపు నించీ, గుమ్మంలోకి వచ్చి ప్రవేశం కోసం ఆగిన నిర్మలవైపునించీ చూపు మళ్లించుకొని, గుమ్మం దాటి ప్రవేశించిన సందేహాలనీ, అశాంతినీ వెంట తీసుకొని శాంతికోసం, సమాధానం కోసం వడివడిగానే నడిచి వెళ్లాడు.

మ. అయవారై చరియింపవచ్చు, తన పాదాంభోజ తీర్థంబుల్
దయతో గొమ్మనవచ్చు, సేవకుని సర్వప్రాణ దేహాదుల
న్నియు నా సొమ్మనవచ్చుగాని సిరులన్నిందించి నిన్నాత్మని
ష్క్రియతం గానఁగరాదు పండితులకున్ శ్రీ కాళహస్తీశ్వరా!